మోమిన్‌ఖుర్దులో రైతు అగ్రోస్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన డీఏవో గోపాల్, ఏడీవో

అగ్రోస్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

ధారూరు, ఏప్రిల్ 26 : ధారూరు మండల పరిధిలోని రైతులు రైతు అగ్రోస్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ అన్నారు. శుక్రవారం మోమిన్‌ఖుర్దు గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు అగ్రోస్ సేవా కేంద్రాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోమిన్‌ఖుర్దు గ్రామం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు రైతు అగ్రోస్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, మోమిన్‌కలాన్ క్లస్టర్ ఏఈవో మల్లేశం, నాయకులు రాజుగుప్తా, వెంకట్ రెడ్డి, రైతులు ఉన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మోసపూరిత హామీలతో గద్దెనెక్కారు

- కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- కడ్తాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కడ్తాల్, ఏప్రిల్ 26 : అధికారమే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారమే ధ్యేయంగా హస్తం పార్టీ నాయకులు అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చారని.. తీరా అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చడంలేదని ఆరోపించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన శాస్తి జరగక తప్పదని హెచ్చరించారు. అన్నదాతలు ఆర్థికంగా ఇబ్బందిపడొద్దనే సదుద్దేశంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అమలు చేసిన రైతుబంధు పథకానికి ఎగనామం పెట్టారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికెళ్లి వివరించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలపై ప్రజల వద్ద చర్చ పెట్టాలని ఆయన సూచించారు.

ఆర్ఎస్పీకి జన నీరాజనాలు

నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని జైపాల్‌యాదవ్ తెలిపారు. విద్యావంతుడు, గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్డుషోకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లి సక్సెస్ చేస్తామన్నారు.

కార్యక్రమంలో జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు శంకర్, జైపాల్‌రెడ్డి, అర్జున్‌రావు, పత్యానాయక్, ఎంపీటీసీలు గోపాల్, కుమార్, నాయకులు వీరయ్య, లాలయ్య, శ్రీను, పవన్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జైపాల్‌నాయక్, రంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, బీరయ్య, రాములు, దశరథ్‌నాయక్, జ్యోతయ్య, శ్రీనివాస్, రాజు, చంద్రమౌళి, సాయిలు, వెంకటేశ్, యాదయ్య, రాజేందర్ యాదవ్, భీక్యానాయక్, మహేశ్ ఉన్నారు.



దేవుని ఎర్రవల్లిలో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని చేవెళ్ల మండల మాజీ ఎంపీపీ మంగళి బాల్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తరపున శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాసానిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను అడుగడుగనా నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు మీకు వచ్చాయా అని బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజలను అడిగి తెలుసుకొని.. రాకపోతే ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు బంధు ఇవ్వలేక బొక్కాబోర్లా పడిందని.. ఇంకా రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ఉచిత విద్య, వైద్యం ఎంతో అవసరమని.. దాని కోసం సీఎం కేసీఆర్ ఎంతో పరితపించి సాధ్యమైనంత వరకు అమలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్‌లో ప్రశ్నించేందుకు జ్ఞానేశ్వర్‌కు అవకాశం ఇవ్వాలని వారు కోరారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటే నని.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలకు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింటు, చేవెళ్ల మండల సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, సర్పంచ్‌లు అంజయ్యగౌడ్, శంకర్ యాదవ్, ఎంపీటీసీ సత్యనారాయణచారి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ డైరెక్టర్లు మహేశ్, కృష్ణ, అబ్దుల్ ఘనీ, నాయకులు రామాగౌడ్, రాములు, విఠల్‌రెడ్డి, రాజు, మహేందర్, రాంప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

సివిల్ ర్యాంకర్ సాహి దర్శినికి సత్కారం

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 26 : యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో ఆల్ ఇండియా 112వ ర్యాంకు సాధించిన గాడిపత్రి సాహి దర్శినిని రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అభినందించారు. జ్ఞాపికను అందజేసి సత్కరించారు. సాహి దర్శిని తల్లిదండ్రులు అయిన మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని సన్‌రైజ్ హైస్కూల్ కరస్పాండెంట్ గాడిపత్రి గిరిధర్, మణి దీపికను కూడా రాధాకృష్ణన్ అభినందించారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డిజిల్లా సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణ

షాబాద్, ఏప్రిల్ 26 : అనాథ, పేద మహిళా అభ్యర్థుల నుంచి పలు డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డిజిల్లా సంక్షేమశాఖ అధికారి పద్మజారమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం, మధురానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్ సమీపంలో పాలిటెక్నిక్ కళాశాలలోని పలు డిప్లొమా కోర్సులను అందివ్వనున్న నేపథ్యంలో అర్హులం దరూ వినియోగించుకోవాలని కోరారు. సివిల్ ఇంజినీరింగ్(DCE), ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్(DEEE), కంప్యూటర్ ఇంజినీరింగ్(DCME), ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(DECE) డిప్లొమా కోర్సులు చేయడానికి 60 సీట్లు మాత్రమే ఉంటాయన్నారు. ఇందులో అనాథలకు(Orphan), పాక్షిక అనాథ(Semi Orphan)లకు, పేదవారికి, ట్రాఫికింగ్‌కు గురైన అమ్మాయిలు, బాలికా సంరక్షణ కేంద్రంలోని అమ్మాయిల కోసం 70 శాతం సీట్లు అనగా ఒక్కో కోర్సులో42 సీట్లు వీరికి కేటాయించబడ్డాయని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ నియమం ప్రకారం 3 శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించబడుతాయని తెలిపారు. తెలంగాణ పాలీసెట్ పరీక్ష రాయకపోయినా 10వ తరగతి ఉత్తీర్ణత పొందినవారు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మే 20 లోగా సంబంధిత కుల, ఆదాయ, డెత్(అర్బన్/సెమీ అర్బన్), బోనఫైడ్, టీసీ, స్టడీ సర్టిఫికెట్స్, పదో తరగతి మెమో అన్నీ అప్లికేషన్ ఫామ్‌తో జతచేసి బాలరక్షా భవన్, రంగారెడ్డిజిల్లా అమీర్‌పేట్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రంతో అశోక్

కొడంగల్ కళాకారుడికి అరుదైన అవకాశం

తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో అశోక్‌కు చోటు

కొడంగల్, ఏప్రిల్ 26 : దౌల్తాబాద్ మండలంలోని యాంకి గ్రామానికి చెందిన డా.సున్నపు అశోక్(సూక్ష్మ చిత్ర కారుడు) అరుదైన ఘనత దక్కించుకున్నాడు. అతడు దేశభక్తి, దైవభక్తి ఉట్టిపడేలా ఎన్నో చిత్రాలను చిత్రీకరించి అందరి మన్ననలను అందుకుంటున్నాడు. అక్కరకురాని ఎన్నో వ్యర్థ పస్తువులతో విభిన్నమైన కళాఖండాలను ప్రదర్శించి అందరినీ అబ్బురపరుస్తున్నాడు. అశోక్ కళా సేవలను గుర్తించిన ప్రభుత్వం తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందించి గౌరవ సత్కారం అందించింది. ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నందుకు అశోక్ సంతోషాన్ని వ్యక్తం చేశాడు. రాబోవు రోజుల్లో మరింత కృషి చేసి వరల్డ్ రికార్డును సాధించేందుకు పట్టుదలతో ఉన్నట్లు పేర్కొన్నాడు. అశోక్ ఇంతటి స్థానాన్ని పొందినందుకు తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు, నియోజకవర్గ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

ఆహార ఉత్పత్తుల ముసుగులో..

ఔషధాల తయారీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఆహార ఉత్పత్తుల తయారీ ముసుగులో పలు రకాల ఔషధాలను తయారు చేస్తున్న రెండు వేర్వేరు ఫార్మా కంపెనీలపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో పలు రకాల ఔషధాలను సీజ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, నాచారంలో ఆహార ఉత్పత్తుల తయారీ కోసం అనుమతి తీసుకుని 'ఆక్సిఫర్-ఎక్స్‌టీ' అనే మాత్రలు తయారు చేస్తున్నారు. ఈ మాత్రలను 'ఆర్గానిక్ ఫార్మా' అనే కంపెనీ పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు ఈ నెల 25, 26న దాడులు జరిపి, డీసీఏ నుంచి అనుమతి లేకుండా ఆహార ఉత్పత్తుల తయారీ ముసుగులో తయారు చేస్తున్న ఆక్సిఫర్-ఎక్స్‌టీ మాత్రలను సీజ్ చేశారు. కాగా మరో కేసులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఎస్ఎన్‌పురం, రోడ్ నం.10లో ఉన్న కెన్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్‌పై సిద్దిపేట జోన్‌కు చెందిన డీసీఏ అధికారులు దాడులు జరిపారు. డీసీఏ అనుమతి లేకుండా ఆహార ఉత్పత్తులు తయారీ ముసుగులో 'నురోవిస్-ఎస్‌సీ' మాత్రలు తయారు చేస్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. అంతే కాకుండా ఈ ఔషధాలను నాగోల్‌లోని తన్వి ఫార్మా మార్కెటింగ్ చేస్తున్నట్లు గుర్తించి, నోటీసులు జారీ చేశారు.

బీసీలంతా ఆలోచన చేయాలె..

బీసీ వర్గాలు ఏకం కాకుండా ఆధిపత్యవర్గాల కుట్ర

బీసీ బిడ్డ 'కాసాని' గెలుపునకు బీసీలు క్రియాశీలకంగా

వ్యవహరించాలని పిలుపునిస్తున్న బీసీ నేతలు

బీసీ కులాలను అణచివేతకు గురిచేస్తున్న రాజకీయ పార్టీలకు ఓటు వేసే విషయంలో బీసీలంతా ఆలోచన చేయాలని బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి. ఎన్నో ఏండ్లుగా కులహంకారంతో ఆధిపత్య వర్గాలు కుట్ర చేసి బీసీ వర్గాలు ఏకం కాకుండా ప్రయత్నం చేస్తున్నాయని మండిపడుతున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నేత ఒకరు బీసీలను చిన్నచూపు చూస్తూ చేసిన వ్యాఖ్యలు ఇందులో భాగమేనని నేతలు చెబుతున్నారు. అన్ని బీసీ వర్గాలు ఏకమైతే తమకు అధికారం దూరమవుతుందనే భయం కాంగ్రెస్ పార్టీ నేతలకు పట్టుకోవడం వల్లనే ఈ తరహా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. అటువంటి నేతలు అధికారంలోకి రాకుండా బీసీలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నేతలు సూచిస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు బీసీలంతా క్రియాశీలకంగా పనిచేయాలని కోరుతున్నారు. చేవెళ్ల ఎన్నికతోనే బీసీ కులాలు రాజ్యాధికారానికి పునాది వేసుకోవాలని బీసీ నేతలు పిలుపునిస్తున్నారు. **- రంగారెడ్డి, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)**

జ్ఞానేశ్వర్ గెలుపు.. వెనుకబడిన కులాల అభివృద్ధికి మలుపు

చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు వెనుకబడిన కులాల అభివృద్ధికి మలుపు. బడుగు, బలహీన వర్గాల గొంతుకైన జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకుంటే చేవెళ్ల పార్లమెంట్ ప్రజలకు అన్ని విధాలుగా మేలు జరుగుతుంది. ముఖ్యంగా వెనుకబడిన వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు అభివృద్ధి సాధిస్తాయి. అందుకు అన్ని కులమతాల ప్రజలు పార్టీలకు అతీతంగా కాసానిని గెలిపించాలి.

- వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, తాండూరు

చేవెళ్ల గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే..

96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం. ఎవరెన్ని కుట్రలు చేసినా, మోసాలు చేసినా చేవెళ్ల గడ్డపై కచ్చితంగా బీఆర్ఎస్ జెండా ఎగురుతుంది. బీసీల ముద్దు బిడ్డ కాసాని భారీ మెజార్టీతో ఘన విజయం సాధిస్తారు. బీసీల కోసం అనేక ఉద్యమాలు చేసిన జ్ఞానేశ్వర్‌కు బీసీల మద్దతు సంపూర్ణంగా ఉంటుంది.

- ఉమాశంకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, తాండూరు

పార్టీలతో సంబంధం లేదు

రాజకీయ పార్టీలతో మాకు సంబంధం లేదు. పార్లమెంట్‌లో ముదిరాజ్‌లకు సంబంధించిన బాధలు, అమలుచేయాల్సిన చట్టపరమైన విషయాలు కాసానికి తెలుసు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఆయన చేసిన సేవలు ఎనలేనివి. జనరల్ సీట్లో పార్లమెంట్ స్థానాన్ని ముదిరాజ్ బిడ్డ పోటీ చేయడం చాలా అనందంగా ఉన్నది.

- మాణెయ్య, బీఆర్ఎస్ బీసీ సెల్ ముదిరాజ్ నవాబుపేట మండల అధ్యక్షుడు

ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు

ఓటు బ్యాంకుగా వాడుకునే రాజకీయ పార్టీల మాటలు నమ్మి మోసపోకుండా బీసీలమంతా ఈసారి ఐక్యతతో ముందుకు వెళ్తాం. బీసీలకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీసీలను గత ప్రభుత్వాలు జనరల్ సీట్లలో నిలిపిన సందర్భాలు లేవు. ప్రస్తుతం జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఓటు వేసి గెలిపిద్దాం.

- వెంకటేశ్ ముదిరాజ్, నవాబుపేట

బీసీల గొంతు పార్లమెంట్‌లో వినిపిస్తారు

బీఆర్ఎస్ పార్టీ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపిస్తే బీసీల గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి కాసాని గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం గత 40 ఏండ్లుగా పోరాటం చేస్తూ, 96 బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత కాసానికే దక్కుతుంది. చేవెళ్ల గడ్డపై బీసీ నేతకు ఎంపీ బరిలో నిలిచే అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

- కమ్మరి శ్రీనివాస్, బీసీ నేత, షాబాద్

బీసీ నేత కాసానిని గెలిపించుకుందాం

బీసీలంతా ఒక్కటై ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు సక్రమంగా సీట్లు కేటాయించకుండా మోసం చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలను గుర్తించి 50 శాతం ఎంపీ సీట్లు బీసీలకు కేటాయించడం గొప్ప పరిణామం. చేవెళ్ల గడ్డపై బీసీ నేతకు అవకాశం రావడం సంతోషకరం.

- సురేశ్‌ముదిరాజ్, షాబాద్

కాసానికి బీసీలు అండగా నిలవాలి

చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు బీసీలందరూ ఏకతాటిపై వచ్చి గెలిపించుకోవాలి. గతంలో కేసీఆర్ రంజిత్‌రెడ్డికి, విశ్వేశ్వర్‌రెడ్డిలను నమ్మి టికెట్ ఇచ్చి గెలిపిస్తే వారు స్వలాభం కోసం పార్టీలు మారారు. అలాంటివారిని మళ్లీ గెలిపిస్తే బీసీలకు న్యాయం జరుగదు. బీసీల సమస్యలపై ఒక బీసీ నాయకుడు మాత్రమే పోరాడుతాడు తప్ప ఇతరులు పోరాడరు. **- వల్లూరి రమేశ్, ఆర్కేపురం**

బీసీల సత్తా చాటుదాం

బీసీల ఓట్లను కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు వేసి బీసీల సత్తా ఏంటో చూపుదాం. కాంగ్రెస్, బీజేపీ చేవెళ్లలో అగ్రవర్ణ నాయకులకు టికెట్ ఇచ్చింది. కేసీఆర్ ఒక బీసీ నాయకుడైన జ్ఞానేశ్వర్‌కు టికెట్ కేటాయించి బీసీలకు పెద్దపీట వేస్తున్నారు. కాసానిని గెలిపిస్తే సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుంది.

- సిద్దగోని వెంకటేశ్‌గౌడ్, ఆర్కేపురం

ఎన్నికల్లో మా శక్తిని చాటుతాం

వెనుకబడిన వర్గాల ఐక్యతపై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు సరైనవి కావు. ఏండ్ల తరబడి బీసీ వర్గాలను రాజకీయపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్నాయి. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ బిడ్డ కాసానికి ఇవ్వడం ద్వారా ఈ వర్గాల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఈ ఎన్నికల్లో జ్ఞానేశ్వర్‌నుఅధిక మెజార్టీతో గెలిపించుకుని బీసీల శక్తిని చాటుతాం.

- మోహన్ ముదిరాజ్, మియాపూర్

అహంకారపూరిత వ్యాఖ్యలు సరికాదు

రాజకీయ సామాజిక సమానత్వం కోసం వెనుకబడిన వర్గాలు క్రియాశీలక పోరాటాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నాయి. బీసీలు ఎల్లప్పుడూ ఐక్యతతోనే తమ సంక్షేమం కోసం పోరు చేస్తున్నాయి. ఇట్లాంటి సమయాల్లో బీసీల ఐక్యత పట్ల కాంగ్రెస్ నేతలు అహంకారపూరితంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు. చేవెళ్లలో బీసీ బిడ్డ కాసానికి ఓటు వేసి గెలిపించి పార్లమెంటుకు పంపుదాం.

- చంద్రమోహన్ సాగర్, బీసీ సెల్ అధ్యక్షుడు, మియాపూర్

బీసీలంతా ఐకమత్యంగా ఉన్నప్పడే లబ్ధి

బీసీలంతా ఐకమత్యంగా ఉన్నప్పుడే లబ్ధి చేకూరుతుంది. కాంగ్రెస్ నాయకులు బీసీల పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణం. ఇలాంటివారికి ఓటు హక్కు, ఐక్యతతోనే తగిన గుణపాఠం నేర్పించాలి. చేవెళ్లలో బీసీల ముద్దుబిడ్డ, ఉద్యమ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది.

- రఘుముదిరాజ్, మైలార్‌దేవ్‌పల్లి

అన్ని వర్గాల ప్రజలకు అండగా కాసాని

అన్ని వర్గాల ప్రజలకు కాసాని జ్ఞానేశ్వర్ అండగా ఉంటారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన శక్తి వంచన లేకుండా కృషి చేస్తారు. గతంలో ఉద్యమ సమయంలోనూ ఆయన తనదైన శైలిలో ఉద్యమించి హక్కుల కోసం పోరాడారు. రాజకీయాలకతీతంగా బీసీలు సిద్ధమై బీసీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలి.

- కొండల్‌ముదిరాజ్, కాటేదాన్

బీఆర్ఎస్ అభ్యర్థికి పట్టం కడుతాం

రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుతాం. కాసాని పరిగి నియోజకవర్గానికి మంచి పరిచయమున్న నాయకుడు. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే జ్ఞానేశ్వర్‌కు ప్రజలు పట్టం కట్టాలి. ఇతర పార్టీలకు చెందిన నాయకులను గతంలో గెలిపించినా ఎప్పుడూ ప్రజల సమస్యలను పట్టించుకోలేదు.

- మందిపల్ వెంకట్,
పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, కులకచర్ల

బీసీ అభ్యర్థితోనే న్యాయం జరుగుతుంది

బీసీలకు న్యాయం జరుగాలంటే బీసీ అభ్యర్థితోనే సాధ్యం అవుతుంది. చాలా ఏండ్ల నుంచి చేవెళ్ల పార్లమెంటు నుంచి బీసీలకు ఏ పార్టీలు అవకాశం ఇవ్వలేదు. కాని బీఆర్ఎస్ అధినేత కాసాని జ్ఞానేశ్వర్‌కు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. ఈ అవకాశాన్ని బీసీలు సద్వినియోగం చేసుకొని బీసీల సత్తా ఏంటో నిరూపించాలి.

- చాకలి అంజిలయ్య, మాజీ సర్పంచ్, బొంరెడ్డిపల్లి, కులకచర్ల మండలం

కొత్త ఓటర్లు @ 8,351

- వికారాబాద్ జిల్లాలో పెరిగిన ఓటర్లు
- అత్యధికంగా తాండూరు నియోజకవర్గంలో 2651 మంది
- అత్యల్పంగా వికారాబాద్ సెగ్మెంట్‌లో 1512 మంది
- ఓటరు అనుబంధ తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు-9,83,191
- పురుషులు-4,85,210 మంది, మహిళలు-4,97,946, ఇతరులు-35 మంది



వికారాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): జిల్లాలో కొత్త ఓటర్లు పెరిగారు. 8,351 మంది కొత్త ఓటర్లుగా ఓటరు జాబితాలో చేరారు. అత్యధికంగా తాండూరు నియోజకవర్గంలో 2,651 మంది ఓటర్లు పెరుగగా, పరిగిలో 2,293 మంది, కొడంగల్‌లో 1,895 మంది, వికారాబాద్ నియోజకవర్గంలో 1,512 మంది కొత్త ఓటర్లు జాబితాలో ఎంట్రీ అయ్యారు. అయితే ఓటరు తుది జాబితా అనంతరం జనవరి 23 నుంచి ఓటరుగా నమోదు చేసుకోని వారికి ఎన్నికల సంఘం మరోసారి అవకాశమివ్వగా జిల్లావ్యాప్తంగా 9,372 మంది కొత్త ఓటరు నిమిత్తం దరఖాస్తు చేసుకోగా.. అందులో 1,021 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురికాగా.. 8,351 దరఖాస్తులకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆమోదం తెలిపింది. అయితే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభ తేదీ వరకు కొత్త ఓటరుగా నమోదుకు అవకాశమిచ్చిన ఎన్నికల యంత్రాంగం శుక్రవారం ఓటరు అనుబంధ తుది జాబితాను విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో మొత్తం 9,83,191 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 4,85,210